
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

అనుగ్రహ 'నందన'వనం



ప్రేమ, ఔన్నత్యం, ఔదార్యం కలగలసిన
కరుణా రసహృదయ దయా స్వరూపమే - గురువు

శ్రీరామనవమి సంచిక

# స్వాధ్యాయము - ప్రవచనము

"స్వాధ్యాయ ప్రవచనేభ్యోన్న ప్రమది తవ్యం" అని వేదం ఉద్బోధిస్తున్నది. అంటే – వ్యక్తి స్వాధ్యాయము, ప్రవచనములను ఆచరించుటలో పొరపాటున గూడా అజాగర్త కూడదు–అని, అశ్రద్ధ వహిస్తే ప్రమాదమనే హెచ్చరిక కూడా ఆ ఆదేశంలో వుంది.

***నిశ్రేయసమైన లౌకిక, ఆధ్యాత్మిక వికాసానికి, అభ్యుదయానికి అవసరమైన విషయాలను, ఉత్తమ గ్రంధాలు చదివిగాని, తెలిసిన వారి వద్ద నుండి వినిగానీ, తెలుసుకొని, ఆ తెలుసుకొన్న విషయాలను సహజమయ్యేంత వరకు వివేకంతో మననం చేయడం స్వాధ్యాయం. ప్రకృతితోనూ, సాటి జీవులతోను సామరస్యంగా, ఆనందంగా జీవించలేక పోవడానికి తనలో వున్న అడ్డంకులను గుర్తించి తొలగించుకునే ప్రయత్నం – స్వాధ్యాయము. స్వాధ్యాయం ద్వారా మనకు తెలిసిన విషయాలను అవి తెలియని వారితో పంచుకోవడం ప్రవచనం.***

పరిపూర్ణమైన జ్ఞానము, అర్హత లేకుండా ఆధ్యాత్మిక ప్రవచనం చేయవచ్చునా? అలా చేయడం నిషిద్ధమని శాస్త్రాలు ఘోషించడం లేదా? అంటే నిజమే! ఆత్మతత్త్వము, సూక్ష్మతర సాధనా మార్గాలు మొదలైన వాటి గురించి ప్రవచనం నిషిద్ధమే! కానీ ధర్మ ప్రవచనం తప్పనిసరిగా చేయాలని శాస్త్రవిధి. అందుకే ప్రధానంగా బ్రహ్మ విద్యా ప్రబోధకమైన ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు మొదలైన వాటిని చెప్పేవారు, వినేవారి యొక్క అధికారాన్ని (అర్హత) గూర్చిన ప్రస్తావన వుంటుందిగాని, ధర్మ విషయాలు, భగవంతుని యొక్క భాగవతుల యొక్క లీలా విశేషాలను గూర్చి చెప్పే రామాయణ, భారత, భాగవతాదులకు 'అధికార' ప్రసక్తి లేదు. అవి సర్వులూ తెలుసుకొని తమ సాటివారితో పంచుకోవచ్చు. స్వాధ్యాయము, ప్రవచనము ద్వారా వ్యక్తి నుండి వ్యక్తికి, దేశం నుండి దేశానికి, తరం నుండి తరానికి అందించుకుంటూ పోవడం ద్వారానే సుస్థిరమైన సామాజిక శ్రేయస్సును సాధించగలం. తద్వారానే ఇంతటి విజ్ఞానాన్ని మానవాళికందించిన ఋషుల ఋణాన్ని తీర్చుకోనూగలం.

మనకేదైనా అద్భుతమైన విషయం తెలిస్తే ప్రక్కవారితో పంచుకోకుండా వుండలేము. మనకేదయినా శుభం జరిగితే దాన్ని విందు రూపంలోనో, మరింకో రూపంలోనో ఆ ఆనందాన్ని మన సాటివారితో పంచుకుంటాము. ఇది మానవనైజం. మరి అత్యంత అద్భుతము, ఆశ్చర్యకరము అయిన ఆధ్యాత్మిక సత్యాన్ని, తమకు నిశ్రేయస ఫలాన్నివ్వగలదని నమ్మిన జీవన విధానాన్ని సాటి వారితో పంచుకోకపోవడం మానవత్వమేనా? అయితే ఈ స్వాధ్యాయ, ప్రవచనాలు ఏదో మొక్కుబడిగా, 'శాస్త్రానిక'న్నట్లు ఆచరించకుండా దానివల్ల ఒనగూడే వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలను తెలుసుకుని, అవగాహనతో చేస్తే అది మనకు ప్రియమవుతుంది. ఇష్టమైనది కష్టం కాకుండా పోతుంది. శతపథ బ్రాహ్మణంలోని స్వాధ్యాయ ప్రశంసలో అన్నట్లు: "ప్రియే స్వాధ్యాయ ప్రవచనే భవతః... సుఖం స్వపిత... పరమ చికిత్సక ఆత్మనో భవతి..."

– ***శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ*** **ముద్రిత వ్యాసాల నుండి**

సంపుటి : 15
ఏప్రిల్ 1

సంచిక : 3
2012

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

ఉన్నమాట-అనుకున్నమాట 4
- గురుకృప

స్వాధ్యాయము - ప్రవచనము 2
- శ్రీబాబూజీ

ఆరతి 6
- శరచ్చంద్రికలు

రసానుభూతి 12
- శరచ్చంద్రికలు

నీ లక్ష్యాన్ని నీవే తెలుసుకో 17
- గురుకృప

సమదృష్టిని కలిగి వుండు! 22
- పార్థసారథి ప్రవచనాలు

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# ఉన్నమాట-అనుకున్నమాట

మనం చూసే ప్రపంచం వాస్తవం. అది అతి సుందరమైనది అని మన ఉపనిషత్తులు చెబుతున్నాయి. ప్రపంచంలో కనిపించే ప్రతి ఆకృతి కూడా భగవంతుడిదే. భగవంతుడే సర్వస్వం అయినప్పుడు, ఆ భగవంతుడు మనవాడు అయినప్పుడు మనకు తగనిది అంటూ ఏదీ వుండదు ఈ ప్రపంచంలో. లోకంలో మంచివి, చెడ్డవి అని వుండవు. కొన్ని మనకు అనుకూలం, కొన్ని అననుకూలం అనేది కూడా ఎప్పుడూ వుండదు. హిరణ్యకశపుడు ప్రహ్లాదుడ్ని పిలిచి "నాయనా! బాగా చదువుతున్నావని తెలిసింది, ఏమి నేర్చుకున్నావో చెప్పు?" అని అడిగాడు. "ఏమి చెప్పమంటారు నాన్నా!" అని అడిగాడు. "మనం పరిపాలకులం కదా, మనకు మిత్రులు, శత్రువులు ఎవరు, వారితో ఎట్లా ప్రవర్తించాలో చెప్పు" అని అడిగాడు హిరణ్యకశపుడు. "అదేం ప్రశ్న, మీరు వేసిన ప్రశ్నే తప్పు" అని అన్నాడు ప్రహ్లాదుడు. "నేను చదువుకున్న వేదాల్లో భగవంతుడు "సర్వభూతాత్మకే జగన్నాధే జగన్మయే పరమాత్మని గోవిందే" అని వుంది, అప్పుడు "మిత్ర అమిత్ర కథాకుతః తాతా" – తగినవారు, తగనివారు వుంటారా, కనుక మీ ప్రశ్న తప్పు" అని సమాధానం ఇచ్చాడు. భగవంతుడు "సర్వభూతాత్మకే" కనిపించే సత్తువకల వస్తువులన్నింటినీ అంటే – ఒక దేహమంటూ ధరించి సత్తా కలిగిన వస్తువులని భూతములు అంటారు. అట్లాంటి అన్ని భూతములలో వ్యాపించి వుంటాడు, ఇది భగవంతునిలోని ఒక లక్షణం. అట్లా వ్యాపించడమే కాక "జగన్నాథే" ఈ జగత్తు అంతా నా సొత్తు అని అనుకోగలవాడు. ఎక్కడో ఒక చోట ఉండి లోకాన్ని నియంత్రించగలడు. 'జగన్మయే' – జగత్తు అంతా తానే అయి వుంటాడు, అలా ఉండి ఏం చేస్తాడు? 'పరమాత్మని' – అందరిలో వుండి నడిపించగలిగినవాడు. ఏ వస్తువు అయినా ఆయా ఆకారంలో వుంది అంటే ఆయన అందులో వున్నాడు కనుక. అయితే అంత గొప్పవాడు మనకు అందడేమో అనే సందేహం లేదు, కనుక 'గోవిందే'– నీకు చేతనైన మాటలతో, నీకు వీలైనట్టు పలికితే అందగలడు, అందుకే పరమాత్మకు "శబ్ధాతిగః, శబ్ధసహః" అని పేర్లు–శబ్ధాలకు అందనివాడు, శబ్ధాలకు అందేవాడు. అంటే నేను అన్ని శాస్త్రములను చదువుకున్నాను అని అనుకునే బ్రహ్మాది దేవతలు భగవంతుడు ఇంత అని చెప్పలేరు. ఆయన గురించి ఎంత చెప్పినా సముద్రపు నీటి బొట్టు అంత మాత్రమే. అయితే ఇంతటి వాణ్ణి గురించి మనం ఏం చెప్పగలం అని అనుకోకుండా, అతి సామాన్యులు ఏ శబ్ధంతో పిలిచినా దాన్ని తనదిగా చేసుకొని రాగలిగినవాడు ఆయన. ఏనుగు ఒకనాడు అరచింది, ఆయన రక్షించాడు అని "గజేంద్రమోక్షం" చెబుతుంది. ఏనుగు ఏమని పిలువగలదు, నన్ను రక్షించగలిగినవాడెవడో రక్షించాలి అని ఘీంకరించి వుంటుంది. ఆ శబ్ధానికి కూడా లొంగి కాపాడ గలిగినవాడు, ద్రౌపది పిలిస్తే రక్షించలేదా, ***విశ్వాసంతో పిలిచిన వాడి పిలుపు శాస్త్రీయంగా ఉందాలేదా అని చూడడు. అట్లా భగవంతుడు ఎంత గొప్పవాడో అంత సులభుడు కూడా.***



అట్లాంటి భగవంతుడు అంతటా ఉండగా "మిత్ర అమిత్ర కథాకుతః" అలా మిత్రుడని, శత్రువని వేరుగా వుంటాడా? పరస్పర విరుద్ధ ధర్మాలు కల వస్తువులు ఒక వద్ద ఉండి సహకరించుకోవడం కొత్త విషయం కాదు. అతి కఠినమైన దంతముల మధ్య అతి సున్నితమైన నాలుక సహజీవనం సాగించడం లేదా? అన్నింటిని నియంత్రించేది ఒకడే అయినప్పుడు లోకంలో కొందరిని మిత్రులని, కొందరిని శత్రువులని భావించడం తప్పు" అంటూ "మీరు వేసిన ప్రశ్నే తప్పు" అని ప్రహ్లాదుడు చెప్పాడు. భగవత్ సృష్టిలో ప్రతి వస్తువు మంచిదే. ఏ వస్తువు ఏ స్థానంలో వుండాలో ఆ క్రమంలో వుంటే ఎట్లాంటి తప్పు లేదు. అంతకు మించిన సుందరమైనది లేదు. ప్రపంచం అతి సుందరమైనది. మనకు కావల్సింది అట్లా దర్శించగలిగిన కన్నులు. దర్శించేరీతిలో దర్శిస్తే దాన్ని సుందరమైన నేత్రము అని అంటారు. భగవంతుడు మనకు మంచి నేత్రములిచ్చాడు, కానీ దాన్ని వాడుకోగలిగే అలవాటు కావాలి. అయితే వాడుకోవడం నేర్పే మహనీయులు కావాలి. అట్లా నేర్పడం కోసం అవతరించిన మహనీయులే గురువులు.

మహనీయుల మదికి మలినము యొక్క జాడ తెలియదు. మంచిని నేర్చిన మనిషిని దైవంగా మార్చే ప్రక్రియలో ఒకరిని అనుగ్రహధారలలో తడిపితే, కలుపు మొక్కలు పెరిగిన మరి ఒకనిలో మాలిన్యపు జాడలను కడిగే సద్గుణాలనే రసాయనాలను చల్లి మంచి వ్యక్తిగా మార్చయత్నిస్తాడు గురువు. అతనికి శత్రువు లేడు – అందరూ అతని మిత్రులే! ఏ పిలుపైనా అది అతనిని తలచినట్లే! భాషకు, భేషజానికి అందేది కాదది, భావానికి, బంధానికి లొంగేదది! మహాత్ముల మది – అనుగ్రహ జీవనది. పంటచేలు భాగ్యం చేసుకున్నాయి, అదే తీరుగా కలుపుమొక్కలూ భాగ్యం చేసుకున్నాయి. వారి ప్రేమ సహజాతి సహజం. జగదోద్ధారకులై, మార్గ దర్శకులైన వారికి ద్వైతమెక్కడుంటుంది. వారు వెళుతున్న 'సత్య'మనే ఆ బాటన ప్రతీవ్యక్తి బాటసారే! కడదాకా తోడ్కొని పోవడమేగానీ, త్రోవన విడవడమనే సందర్భమెరుగరు. మలినమైన మనస్సులు ఎదురైతే – వారిని కలిమితో కదిలించి, ఉద్ధరించి – మేలిమిగా మార్చడమే వారి నైజం. ఇది నిజం.

**'నందననామ' వత్సరాన్ని గురుచంద్రునికి వందనాలు సమర్పించుకుంటూ అనుగ్రహ చందనాలతో జీవితాలను చల్లగా పంచుకుందాం.**

## కైలాసం, వైకుంఠం ఎంతెంత దూరం?

గురువు తన చుట్టూ కూర్చున్న శిష్యులను చూస్తూ 'ఇక్కడ నుండి కైలాసం ఎంత దూరం? వైకుంఠం ఎంత దూరం?' అని ప్రశ్నించాడు. శిష్యులందరూ వెంటనే తమ బుద్ధి కుశలతను వుపయోగించి శాస్త్ర ప్రమాణములను సంగ్రహించి లెక్కలు వేయడం మొదలుపెట్టారు. అప్పుడు ఆ గురువు తన శిష్యుల అతి ఉత్సాహాన్ని చూసి చిరునవ్వుతో 'కైలాసం చేతికందే దూరంలోను, వైకుంఠం పిలుపుకందే దూరంలోనూ వున్నాయి' అని చెప్పాడు. శిష్యులు తమ గురువు మాటలు విని నివ్వెరపోయారు. "యమధర్మరాజు మార్కండేయుని ప్రాణాలను హరించడానికి వచ్చినపుడు అతడు శివలింగాన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. అప్పుడు కైలాసం నుండి శివుడు వచ్చి యమధర్మరాజును శిక్షించి, మార్కండేయుణ్ణి రక్షించాడు. అంటే కైలాసం చేతికి అందినంత దూరంలో వున్నట్లే కదా! తటాకములో మొసలి నోటికి పట్టుబడిన గజేంద్రుడు ఎలుగెత్తి 'నారాయణా' అని పిలిచాడు. వైకుంఠంలో వున్న ఆ శ్రీహరి వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చి గజేంద్రుడ్ని రక్షించాడు. ఆర్తితో పిలిచిన భక్తుని పిలుపు వైకుంఠానికి వినబడిందంటే, మరి వైకుంఠం పిలుపు వినిపించే అంత దూరంలో వున్నట్లు కదా!" అని వివరించారు గురువు. **– రామకృష్ణ ప్రభ నుంచి**



# శరశ్చంద్రికలు

## ఆరతి - జనవరి 2012

ఆరతి అంటే - భక్తులు దైవానికిగానీ లేదా దైవంగా భావించే మహాత్ముని ప్రతిమకుగానీ లేదా సజీవులైన ఒక మహిమాన్విత సత్పురుషునికిగాని అభిముఖంగా నిలబడి అందరూ కలసి ఆయన సంకీర్తనలను సమిష్టిగా ఒకేస్వరంతో పాడుతూ, అర్చించే ఒక సామూహిక పూజా విధానం (ఆరతి సేవ). సాధారణంగా, సంగీత వాయిద్యాలైన చిరుతలు, తాళాలు, గంటలు మొదలైనవి ఈ సంకీర్తనకు సహకరిస్తాయి. సుగంధభరితమైన అగరుబత్తీలు, సాంబ్రాణి సహితంగా ఆరాధ్యమూర్తిని పూలమాలలతో భక్తి పూర్వకంగా అలంకరిస్తారు. తరువాత భక్తులు ఆరతి గీతాలను ఆలపిస్తుండగా పూజారిగానీ, లేక భక్తుడు గానీ, అయిదు వత్తులు గల నేతి దీపాలు లేదా కర్పూరంతోగానీ ఆరతి చేస్తారు. దీపాలతో చేసే ఈ అనుష్టానాన్నే ఆరతి అంటారు.

ఎక్కువమందికి, ఓ సామూహిక వాతావరణంలో సాగే ఆరాధన అనేక విధాలుగా వుపయోగపడుతుంది. ఆ సామూహిక వాతావరణంలో, సంఘటిక భక్తిభావావేశం నిండి నిబిడీకృతమైన ఆ ప్రదేశంలో భక్తులు ప్రార్థించుకోవచ్చు. ఒకే తాళాన్ని అనుసరించి భక్తి గీతాలను ఒకే స్వరంతో అందరితో కలసి సమిష్టిగా పాడుతున్నపుడు భక్తుడు తన అహంకారపు పొరలను ఛేదించుకుని ఆ సంఘటిత లయలో సులభంగా కలసిపోగలడు. సమిష్టిగా పాడటమనేది పరివ్యాప్తమైన చైతన్య భావనను కలుగచేస్తుంది. ఆ భావనలో ఎవరికి వారు తమ వ్యక్తిగత స్వరాన్ని కోల్పోతారు. ప్రపంచానికి అన్యంగా వున్నామన్న భావన స్థానంలో తాము కూడా ఆ పూర్ణత్వంలో భాగం అనేటటువంటి ఎఱుక వారి గ్రహింపులో లేకుండానే కలుగుతుంది. ఇంకా, ఆ ఉత్తేజభరిత సంఘటిత భావోద్వేగ తీవ్రతలో 'తానువేరు' అనే ప్రత్యేకమైన గుర్తింపు సామూహిక చైతన్య స్రవంతిలో కరిగిపోతుంది. దానితోపాటు ఇంద్రియాలన్నీ, దృష్టి-మనోహరంగా అలంకరింపబడిన విగ్రహమూర్తిమీద, వాక్కు-మేళతాళాలు, గంటలతో అందరిలో కలసిపాడటంలో, ఘ్రాణేంద్రియం- సుగంధభరితమైన ధూపాలు, పుష్పహారాల పరిమళాలను ఆఘ్రాణిస్తూ... ఇలా ఆరతిలో గాఢంగా లగ్నమవడం వల్ల ఈ ఇంద్రియాలు భక్తుల హృదయాలలో ఒకరకమైన అలౌకిక, పరమానంద పారవశ్యాన్ని కలుగచేస్తాయి.

**- పూజ్యశ్రీ బాబూజీ విరచిత "ఆరతి సాయిబాబా" (సాయిపథం పబ్లికేషన్స్, 1996) నుండి**

**గురువుగారు :** బాబా ఆరతిలో "థక్ గయా మేరీ రసనా" అని పాడుకుంటాం, అంటే "నేను మూగబోయాను" ("నా నాలుక అలసిపోయింది") అని. నిజానికి, ఒకరు తమను తాము మరచిపోయినపుడు కలిగేటటువంటి



ఆ విస్తృత భావాన్ని దాసగణు వ్యక్తం చేస్తున్నాడు. ఆయన కవిత్వాన్ని మేళవించి పాడుతున్నాడు కాబట్టి "మూగబోయాను" అనే పదాన్ని వాడాడు. కానీ అసలు ఆయన నాలుకెందుకు మూగబోయింది? ఎందుకంటే ఆయన మనస్సు స్తబ్ధమైపోయింది. ఆయన మరి మాట్లాడలేకపోయాడు. మళ్లీ ఇది అటువంటిదే: మనం చదువుతున్నపుడు కూడా ఆరతి పాడుతున్నపుడు కలిగే అనుభూతే కలుగుతుంది. మనం ఆరతి పాడినపుడు కనీసం కొంతమటుకైనా, మన మనస్సులు విస్తృతమవ్వాలి. అదీ నిజమైన ఆరతి.

**భక్తుడు** : గురువుగారూ! మీరు శిరిడీలో ఆరతులకు వెళుతుండేవారా?

**గురువుగారు :** అవును, నేను ప్రారంభంలో ఆరతులకు వెళుతుండేవాడిని. నాకు ఆరతులంటే ఇష్టం. నేను వాటిని ఆనందిస్తాను. అలాగని నాకు ఆరతుల పట్ల అనురక్తి అంటూ ఏమీ లేదు. నిజానికి నేను ఆరతి ఇవ్వడం కూడా నాకు ఇష్టమే. బాబాకు సంబంధించింది ఏదైనా నాకు అభ్యంతరం లేదు. ఆరతులన్నింటిలోకెల్లా దాసగణు ఆరతులంటే నాకు ఎక్కువ ఇష్టం. ఒక విధంగా, నాకు "సాయి రహమ్ నజర్ కర్‌నా"తో ప్రారంభమయ్యే ఆరతి ఎంతో మనోహరంగా వుంటుంది. అందుకనే, సత్సంగాలలో ఏమి చేసుకోవాలి అని అందరూ అడిగినపుడు, అన్ని ఆరతులూ అవసరం లేదు. మీకు కావాలనిపిస్తే "సాయి రహమ్ నజర్ కర్‌నా" వరకు పాడుకోవచ్చు అని చెప్పాను. అది అప్పుడలా ప్రారంభమైంది, అంతేగాని నేను దానిని నిర్దేశించలేదు.

**భక్తుడు** : గురువుగారూ! మీరు ఈ రెండు ఆరతులను ఎందుకని అంతగా ఇష్టపడతారు?

**గురువుగారు :** నాకు ఆ ఆరతులలోని ప్రతి విషయం నచ్చుతుంది... వాటిలో ప్రకటమయ్యే మొత్తం భావం... ఆ శైలి... దానిని వ్యక్తం చేసినవారు... వారు దానిని వ్యక్తం చేసిన విధానం... ఇలా అన్నీ...

**భక్తుడు** : మీరు చెప్పేది దాసగణు మహరాజ్ గురించేనా?

**గురువుగారు :** అవును, దాసగణు మహరాజ్ గురించే. బాబా చేతులమీదుగా ప్రసాదాన్ని తీసుకోవడానికి కూడా కాస్త సంకోచించిన ఒక సాంప్రదాయ బ్రాహ్మణుడాయన. అయినప్పటికీ 'మసీదులో నేను చీపురును' అని చెప్పడానికి సిద్ధపడ్డాడు. ఆ కాలంలో సాధారణంగా ఒక బ్రాహ్మణునికి, ముస్లింలు అంటేనే పరజాతివారు, కడజాతివారు, అంటరానివారుగా అనిపించేవారు. వారు ముస్లింలను తాకేవారుకాదు. అలాగే మసీదులో చీపురు కూడా అంటరానిదే. ఎందుకంటే అది మురికిని తాకుతూ ఆ దుమ్ము, ధూళిని ఊడుస్తుంటుంది. దాసగణు మహరాజ్ ప్రతీకగా ఇలా చెబుతున్నారు: "నేను ఇక్కడున్నది మీ పాదధూళి కోసమో లేక అనుగ్రహం కోసమో కాదు. నాదృష్టి వాటిపై లేదు. నీ భక్తుల పాదధూళిని ప్రోగు చేసుకోగలిగితే చాలు. ఇదే నేను చేసే పూజ, అదే నాకు ఆనందాన్నిస్తుంది." ఇటువంటి వ్యక్తీకరణలు చాలా వున్నాయి.



"ఉదాహరణకు, "సాథీ ఆఖర్‌కా" (చివరి వరకు సహచరుడు), "రహమ్ నజర్ కర్‌నా", వాస్తవానికి ఆయన వాడిన పదాలు ఇస్లాంకు సంబంధించినవి. ఒకవేళ ఆయనే గనుక హిందూ పద్ధతిలోనే వ్రాయాలనుకుంటే హిందీ పదాలను వాడి వుండవచ్చు. "నజర్" అనే పదమూ, ఇంకా ఆయన వాడిన ఇతర పదాలు ఆయన పాండిత్యాన్ని కూడా తెలియచేస్తున్నాయి. మనోహరమైన ఆ అనుభూతి అందంగా వ్యక్తం చేయబడింది. ఆయన అలా అనుభూతి చెంది వుండకపోతే అలా వ్రాయడం సాధ్యపడదు.

**భక్తుడు** : బాబాను ముస్లింగా గౌరవించడానికి "నజర్"ను (అనే పదాన్ని) ఎంపిక చేసుకున్నారా?

**గురువుగారు :** బాబా ముస్లిమేనని ఆయనకు గట్టి నమ్మకం. అందువల్ల ఆయన ముస్లిం పద్ధతిలో వ్యక్తం చేయాలనుకున్నారు. దానికనే ఆయన ఇస్లామిక్ పదాలను ఉపయోగపెట్టాడు.

**భక్తుడు** : ఇస్లాం పట్ల ఆయనకు గల గౌరవభావంతోనా?

**గురువుగారు :** ఆయనకున్న భక్తి వల్ల. బాబా ఆయనకు సద్గురువు. దానిని నువ్వు "గౌరవం" అని చెప్పలేవు. అది భక్తి. ఎంత గాఢమైన భక్తంటే, బాబా మసీదులో ఆయన చీపురు కావాలనుకున్నాడు. దానిని నువ్వు గౌరవం అంటావా? అది చాలా తేలికైన పదం. బాబాను ఆయన గౌరవించలేదు, ఆయన కేవలం గౌరవించేవాడు మాత్రమే కాదు. అది అంతకన్నా (గౌరవం కన్నా) చాలా చాలా ఎక్కువ.

మీరు **'ఆరతి సాయిబాబా'** చదివారా? నేను అనుభూతి చెందిన కొన్ని విషయాలను అందులో వివరించడానికి ప్రయత్నించాను. పరిమితమైన నా స్వంత పరిధిలో **"ఆరతి సాయిబాబా"**లో వీటిపై వ్రాసిన వ్యాఖ్య ద్వారా ఈ రెండు ఆరతుల పట్ల నాకు గల అభిమానాన్ని పంచుకోవడానికి ప్రయత్నించాను. అసలు నేను వాటిని ఎందుకు ఇష్టపడతాను అనే దానికి గల అనేక కారణాలలో ఇది కేవలం ఒక అంశం మాత్రమే.

**భక్తుడు** : నరసింహస్వామిగారు "సాథీ ఆఖర్‌కా"ను "చివరి క్షణాలలో సహాయం చేసేవారు" అని అనువదించారు.

**గురువుగారు :** నిజానికి సాథీ అనంటే "సహచరుడు / వెంటనుండేవాడు" అని; "సహచరుడు" అనేది ఖచ్చితమైన అనువాదం. బహుశా ఆయన (నరసింహస్వామిగారు) బాబాను ఉద్దేశించి సహచరుడు అనే పదాన్ని వాడటానికి ఇష్టపడి వుండకపోవచ్చు. ఎందుకంటే బాబాను సాథీ–సహచరుడు, స్నేహితుడు అనడం బాబాను అగౌరవపరచడంగా ఆయన భావించి వుండవచ్చు. అందుకనే ఆయన దానిని "సహాయకుడుగా" మార్చి వుండవచ్చు. అయినా, ఆయన అందుకే అలా చేశారా లేదా అన్నది నాకు తెలియదు. కానీ వాస్తవికంగా చూస్తే సాథీ అంటే "సహచరుడు", ఆఖర్‌కా అంటే "చివరి వరకు". నిజానికి కేవలం చివరలోనో లేక చరమావస్థలోనో కాదు. మొదటి నుండి చివరి దాకా ఆయన వుంటారు.



ఆఖరి సన్నివేశంలో వచ్చే తెలుగు సినిమా పోలీసులాగా కాదు – దానివల్ల ఎలాగూ ఎటువంటి ప్రయోజనం వుండదు. అలా కాదు. మొదటి నుండి చివరి దాకా ఆయన (మనకోసం) వుంటారు.

**భక్తుడు :** అందరితో కలసి ఆరతి చేయడం వలన ఏదైనా అంతర్గత ప్రయోజనం వుంటుందా?

**గురువుగారు :** అదో వ్యక్తీకరణ మాత్రమే. అందులో అంతర్గత ప్రయోజనం ఏమీ లేదు. దానిని నువ్వు వ్యక్తం చేసేటటువంటి విధానం, అది నీకు ఎలాంటి అనుభూతిని కలుగచేస్తున్నది అనేదే అందులోని ఏకైక అంతర్లీనమైన ప్రయోజనం. ఒకవేళ ప్రేమను మీరు స్వతహాగా వ్యక్తపరచలేనపుడు, మీకది తగిన వ్యక్తీకరణ అని అనిపించినపుడు దానిని (అందరితో కలసి ఆరతిని) చెయ్యండి. అందులో ఇబ్బందేం లేదు. అంతేకాని తప్పకుండా చెయ్యాలని కానీ, చెయ్యకూడదని కానీ లేదు. కొంతమందికి, "ఆరతి పాడుతుంటే బాగుంది, ఆరతి చెయ్యడం నాకు ఇష్టం. నేను ఏదో అనుభూతి చెందుతున్నాను, నాకు ఆనందంగా ఉంటుంది" ఇలా అనిపిస్తుంది. అలాంటపుడు చెయ్యండి, అంతేగాని బాబాకు ఆరతి అలానే చెయ్యాలి లేకపోతే ఆయన అనుగ్రహం మనపై వర్షించదని అనుకోవడం తప్పు. అది ఓ వ్యక్తీకరణ మాత్రమే. దానిని అప్రయత్నంగా జరగనివ్వండి. మీరు స్వతఃసిద్ధంగా అలా వ్యక్తపరచలేనపుడు మీ చుట్టుప్రక్కల అందుబాటులో తయారుగా వున్నవాటిని ప్రయత్నించండి. మీకు తగిన దానిని ఎంపిక చేసుకోండి. ఉదాహరణకు, మీ స్నేహితునికి శుభాకాంక్షలు చెప్పాలనుకున్నపుడు, కవిత్వంతో కూడిన ఆలోచనగాని, వాక్యంగాని మీకు తట్టనపుడు ఏం చేస్తారు? మీరు ఒక షాపుకెళ్లి రకరకాల కార్డులు చూస్తూ కార్డులన్నింటిలో మీకు నచ్చింది, మీరు చెప్పాలనుకున్న భావం గలది దొరికే వరకు వెతికి దానిని ఎన్నుకుంటారు. దానిని కొని అతని పుట్టినరోజునాడో, క్రిస్మస్‌కో, క్రొత్త సంవత్సరంనాడో, అది ఏదైనాగాని అతనికి (కార్డు) పంపుతారు. ప్రతి ఒక్కరూ వాళ్ల ప్రేమను ఆరతులలో మాదిరిగానే వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. అందమైన కవిత్వం, చిత్రాలు, డిజైన్లు ఇలా ప్రపంచంలో వేరే పద్ధతులు చాలా వున్నాయి. మీకు బాగా సరిపోయే దానిని తీసుకుని ఉపయోగపెట్టుకోండి. బాబాకు మీ శుభాకాంక్షలు పంపించండి!

**గురువుగారు :** బాబా ఆరతులు ప్రతి ఒక్కరికీ తెలియకపోవచ్చు. ఆ విషయం నాకు తెలుసు. కానీ అక్కడ కూర్చుని ఆనందంగా దానిని ఆస్వాదించడం, బాబాను పూజ్యభావంతో అలా చూస్తూ ఆరతిని వినడం, అదీ పాల్గొనడమే. ఆ భాష తెలిసినవాళ్లు, మాట్లాడడం వచ్చినవాళ్లు పాడితే పాడవచ్చు. అంతేగాని ఆరతిలో పాల్గొనడమంటే ప్రతి ఒక్కరూ పాడాలని కాదు. అందరి మధ్యలో అక్కడ నిలుచుని, ఆ మొత్తం సందర్భాన్ని ఆనందంగా అనుభూతి చెందడం – అదీ ఆరతులలో పాల్గొనడమంటే. నేను అలానే అనుకుంటాను. ప్రతి ఒక్కరూ ఆరతి పాడాలని నేననుకోను. కానీ మీరు అక్కడుండటం, మీదైన మార్గంలో మీ ప్రేమను వ్యక్తం



చేయడం నేను ఇష్టపడతాను. ఎందుకంటే అక్కడ వుండటం వల్ల బాబాను ప్రేమించే మిగతావారితో కలవడమనే ప్రయోజనం కలుగుతుంది. ఎవరైనా వ్యక్తి వేరొక వ్యక్తిని ప్రేమించినపుడు, తన మాదిరిగా ఆ వ్యక్తిని ప్రేమించే వాళ్లతో కలసి వుండటానికి ఇష్టపడతాడు.

నన్ను ఇష్టపడేవాళ్ళు, నేను ఇంటి దగ్గర వున్నపుడు (అందుబాటులో వున్నపుడు), వ్యక్తిగతంగా కలుసుకోవాలనుందని నాకు చెప్తుంటారు. కానీ వీళ్లే, నేను విగ్రహప్రతిష్ఠ కోసం వెళ్లినపుడు అక్కడ వేలమంది వున్నప్పటికి వాళ్లు కూడా అక్కడ వున్నందుకు మరింత ఆనందంగా వుంటారు. ఎందుకని? ఎందుకంటే వాళ్లు తమలాగే ఇష్టపడే వారి మధ్యలో, తమలాగే ప్రేమించే సాటివారి మధ్యలో వున్నారు. ఎప్పుడైతే ఒకరికి ఇష్టమైన విషయం చాలా మందికి ఇష్టమైనపుడు, ఆ సమిష్టి ప్రేమ అక్కడ అంతటా వ్యక్తమవుతూ వుంటుంది. అది ఆ ఆనందాన్ని మరింత పెంచుతుంది. ఆరతిలో ఏం జరుగుతుందంటే అక్కడ చాలా మంది తమ ప్రేమను వ్యక్తం చేస్తుంటారు – ఎవరిపట్ల? మన ఆరాధ్యదైవం పట్ల! శిరిడీలో సమాధి మందిరంలో ఎవ్వరూ లేనపుడు బాబాను చూడటం అనేది ఒక విషయం, అందరూ భజనలు పాడుతుంటే, పూజారి ఆరతి చేస్తున్నపుడు బాబాను చూడటమన్నది మరో విషయం – ఇదీ మనకు ఆనందాన్ని కలిగిస్తుంది. కారణం మనకు ఆరాధ్య దైవమైన ఆయన అక్కడ ఎంతగానో ఆరాధింపబడుతున్నారు.

అప్పుడు నీకు ఎక్కడ చూసినా ప్రేమ, ఆ ప్రేమను వెలిబుచ్చడం, రకరకాలుగా ప్రేమను వెలిబుచ్చడం కనిపిస్తుంది. అది మీకు సంతోషాన్ని కలిగించాలి. మీ ఆనందాన్ని ఇనుమడింపచేయాలి. ఆరతికి వెళ్లండి, అందరూ కలసి ఆరతి చేసే విధానాన్ని ఆస్వాదించండి. చాలా మందితో కలసి వుండటం కూడా మేలు కలిగిస్తుంది. అది మీ మనస్సుపై సత్ప్రభావాన్ని కలుగచేస్తుంది. సత్సంగం విషయంలో కూడా ఇది వాస్తవం. మనకు తెలియకుండానే కొన్నిసార్లు మనస్సులో ఆర్ద్రత లోపిస్తుంది. పదిమందితో కలిసుండటం వలన అంతమంది ప్రేమ మధ్యలో కూర్చునుండటం వలన ఆ రసహీనత పోయి, ఆ చుట్టూ వున్న ప్రేమతో మన హృదయాలు ఆర్ద్రమవుతాయి. ఆరతిలోగాని, సత్సంగంలోగాని, అందరితో కలిసుండటం ఇటువంటి ప్రభావాన్ని కలిగి వుంటుంది. కాబట్టి ఇటువంటి ప్రభావానికి మీరు లోనై వుండండి, సిద్ధపడండి. దాని ఫలితాన్ని పొందండి. సమిష్టిగా ప్రేమను వ్యక్తం చేయడంలో ఈ ప్రయోజనం వుంది. అందుకే నేను దానిని ప్రోత్సహిస్తాను.

**గురువుగారు :** నువ్వు గొప్ప పేరున్న వ్యక్తివి (విఐపి) కావచ్చు, చాలా చాలా పేరున్న వ్యక్తివి (వెరీ వెరీ విఐపి) కావచ్చు – కానీ సాయి భక్తునివి కాలేవు. ఆ అహంకార రహిత భావన లేకపోతే ఒక భక్తునివి కాలేవు!! కబీరు, “మే రామ్ కా కుత్తా హు!!’ అంటే “నేను రాముని కుక్కను”అంటాడు. ఆయన్ని ఆయన దానితో (కుక్కతో) పోల్చుకున్నాడు, దాసగణు బాబాతో – తన రామునితో తన సంబంధాన్ని అలా



చెప్పుకున్నాడు. కాని మనకు బాబా ఫోటోకు రెండు మూడుసార్లు నమస్కారం చేయడం కూడా సమస్యే! "బాబాను ఒక స్నేహితునిగా ఎందుకు చూడకూడదు" అని అడుగుతాం. నిజానికి కబీరు రామునికి స్నేహితునిగా వుండి వుండవచ్చు. కానీ ఆయన తనను రాముని కుక్కగా చెప్పుకున్నాడు. ఓ కుక్కలాగా – కుక్కకు ఒక బిస్కెట్ వేస్తే తోక ఊపుకుంటూ వెళుతుంది. ఎప్పుడూ నీ చుట్టూనే తిరుగుతూ వుంటుంది. కేవలం ఒక బిస్కెట్ కోసమే కావచ్చు. అలా భావించండి! "అతను నాతో అలా మాట్లాడాడు, నాకు కోపం తెప్పించాడు లేదా ఇతను నన్ను కొంచెం అగౌరవంగా చూశాడు" అని ఎప్పుడూ కూడా అహంకార భావనలు కలిగి వుండవద్దు. ఇటువంటి విషయాలను పట్టించుకోవద్దు. మనం ఇక్కడికి ఎందుకు వచ్చాం? దానిమీద దృష్టి పెట్టండి! అహాన్ని గౌరవించడం లాంటి విషయాలు అక్కడ వుండకూడదు. మీరు శిరిడీలో వున్నా, బాబా ఫోటో ముందరున్నా అలానే భావించండి. ఆ భావం మీలో కలగాలి. దాసగణు మహరాజ్ "అపనే మస్‌జిద్ కా ఝాడూ గణూ హై" ("గణూ నీ మసీదును ఊడ్చే చీపురు") అన్నారు. ఎంత చక్కని వ్యక్తీకరణ అది! ఆయన ఎన్నడూ బాబాకు ఎప్పుడూ ప్రక్కనే నిలబడుండే వ్యక్తిగత కార్యదర్శి కావాలనుకోలేదు, ఒక చీపురు కావాలనుకున్నాడు! ఆ భావం నాకెంతగానో నచ్చుతుంది. కబీరు దానిని ఒక రకంగా వ్యక్తం చేసాడు. దాసగణు ఇంకోరకంగా వ్యక్తం చేసాడు.

**భక్తుడు :** ఝాడూ అంటే ఏమిటి?

**గురువుగారు :** 'ఝాడూ' అంటే చీపురు. నిజానికి అదొక అంటరాని వస్తువు. సాధారణంగా ఎవరూ దానిని తాకరు. భారతదేశంలో ఒకవేళ ఎవరైనా దానిని ముట్టుకుంటే వాళ్లు కనీసం కాళ్లూ చేతులన్నా కడుక్కోవాలి. ఇంట్లో అది ఒక అంటరాని వస్తువు. కానీ ఆ చీపురు మాత్రమే మసీదులోని బాబా పాదధూళినే కాకుండా, బాబా భక్తుల పాదధూళిని కూడా ప్రోగుచేసుకునే భాగ్యాన్ని కలిగి వుంది. ఆ అదృష్టం, అవకాశం కేవలం చీపురుకు మాత్రమే వుంది. అందుకే ఆయన (దాసగణు మహరాజ్) దానిని ఎంచుకున్నారు. ఆ పాదధూళిని ప్రోగు చేసాక అది అక్కడే ఓ మూలన వుంటుంది! ఎవ్వరూ దానిని తాకరు, అది అంటరానిది. అదీ (తను బాబా మసీదును ఊడ్చే చీపురుననేది) దాసగణు యొక్క వ్యక్తీకరణ – మీరు దీనిని ప్రతిరోజూ ఆరతిలో పాడుతారు. కానీ కొంతమంది, "ఆయనెందుకు ఆరతినిస్తున్నాడు, నేనెందుకు ఇవ్వకూడదు? రేపటి నుండి నేను ఆరతినివ్వాలి!" లేదా "ఇక్కడ ఇంతటి ముఖ్యమైన వ్యక్తిని నేను సత్సంగంలో వున్నపుడు, అతను ఆరతినివ్వడానికి ఆయననెందుకు పిలుస్తున్నాడు?" అంటుంటారు. మళ్లీ "అపనే మస్‌జిద్ కా ఝాడూ గణూ హై" అని పాడుతుంటారు. అది ఎంత అర్ధరహితమో కదా! అందుచేత ఆరతిని అర్ధవంతంగా చేయడానికి ప్రయత్నించండి! దాసగణు మహరాజ్ ప్రారంభంలో ఆచారాలు, సంప్రదాయాలలో ఎంతో



సనాతన భావాలు కలిగివుండేవారు. ఎంతగా అంటే బాబా వద్ద నుండి వచ్చిన పవిత్ర జలాన్ని కూడా తీసుకోలేదాయన. (త్రాగలేదు). ఆయన "నేను అగ్రకులానికి చెందిన బ్రాహ్మణుణ్ణి. ఆయన (బాబా) ముస్లిం" అనుకున్నారు. ఇంకా చాలా అడ్డంకులున్నాయి ఆయనకు.

తరువాత ఆయన ఎంతగా పరివర్తన చెందాడంటే, భారతీయ సమాజంలో (ఆ రోజుల్లో) పాకీ పని చేసేవారిని నిమ్నకులాలకు చెందిన వారుగా, అంటరానివారుగా భావించేవారు. వస్తువులన్నింటిలోకి పాకిపని చేసేవాళ్ల పనిముట్టు – ఊడ్చడానికి వాళ్లు వాడే చీపురు– అత్యంత అంటరానివస్తువు. అందుకని ఆయన ఏ మాత్రమూ ప్రాముఖ్యత లేని ఆ వస్తువు తను కావాలనుకున్నాడు. కాబట్టి ఇంకో రకంగా చూస్తే, సంకేతంగా తనను తాను సమాజంలో పాకీపని చేసే వారితో పోల్చుకున్నారాయన. చూడండి ప్రారంభంలో ఎలా వున్నారు, చివరికి ఎలా పరివర్తన చెందారు!!

## రసానుభూతి – *ఫిబ్రవరి 2012*

**భక్తుడు :** గురువుగారూ! మమ్మల్ని మీరు (మా లక్ష్యంపై) దృష్టి పెట్టమని, మేము వేసే ప్రతి అడుగు మమ్మల్ని ఆ లక్ష్యం వైపుకు తీసుకెళుతోందా లేదా అని తరచి చూసుకోమని, ఇంకా మేము చేస్తున్న పనుల్లో మాకు ఉపయోగపడనివి ఏమైనా వుంటే అటువంటి వాటిని వదిలిపెట్టమని చెప్తుంటారు కదా, మరి కళల సంగతి ఏమిటి? మా జీవితాలలోని సౌందర్యం గురించి ఏమిటి, అవి కూడా మా అవసరంలో (లక్ష్యంలో) భాగమే కదా?

**గురువుగారు :** మీరు మీదైన జీవితంలో, మీ మనస్సులో,శరీరంలో గల రసానుభూతిని ఆస్వాదించగలిగితే అంతకుమించి మనకు కావలసిన కళాఖండాలు ఏమున్నాయి? మనం చూస్తున్నాం, మనం ఆలోచిస్తున్నాం, మనం శ్వాసిస్తున్నాం, మనం ఎన్నో విషయలను అనుభవిస్తున్నాం. అలా శ్వాసిస్తున్నది ఏమిటి? అలా చూస్తున్నది, ఆలోచిస్తున్నది, అలా అనుభవం పొందుతున్నది ఏమిటి? ఇక్కడ ఏమి జరుగుతోంది? ఎంత అద్భుతం (మిస్టరీ) అది! ఉన్నట్టుండి మనలో సంతోషం, అంతలోనే విచారం. మనలో పూర్తి అపనమ్మకం, మరుక్షణం అప్పటికప్పుడు మనకు ఎంతో నమ్మకం. కొంతమంది మనకు ఆనందాన్ని కలిగిస్తారు. కొంతమంది అయిష్టతను కలిగిస్తారు. ఇవన్నీ ఏమిటి? వీటిలోని సౌందర్యాన్ని చూడండి. నా వరకు, మీలో ప్రతి ఒక్కరూ ఓ గొప్ప కళాఖండం! మనం బయట చూసే కళాకృతులన్నీ కేవలం మన స్వీయ (అంతరంగపు) ప్రతిబింబాలే. అవి దానిని (అంతరంగాన్ని) వివరిస్తాయి. దానికి అవి నీడలు వంటివి. మన అంతరంగాన్ని అవి చక్కగా ప్రతిబింబించినపుడు, దానికవి ప్రతిరూపాలైనపుడు, వాటిని అందమైన కళలుగా భావించడం జరుగుతుంది. ఎందుకంటే మనం వాటిని చూసినపుడు, మన స్వీయ జీవితపు సౌందర్య అస్తిత్వాన్ని / రసానుభూతిని (వాటిల్లో) చూస్తాం.

నేను ముఖ్యంగా చెప్పేదేమిటంటే, దీనిని (మిమ్మల్ని మీరు) తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ప్రతి ఒక్కరి మనస్సు, ప్రతి ఒక్కరి ఆలోచన, ప్రతి ఒక్కరి జీవితం ఇలా అన్నీ కళారూపాలే. నాకు, మీరందరూ అందమైన వివిధ రకాలైన కళాకృతుల మాదిరిగా కనిపిస్తారు. మైకలాంజిలో, లియోనార్డోడావెన్సీ సృజించిన వాటికంటే కూడా అందంగా!! (గురువుగారు నవ్వుతూ) అవును, అవి అందమైన కళాకృతులే. కానీ ఎందుకని మనం కాన్వాసు మీద రూపుదిద్దుకున్న దానిని చూసి ఆనందించినంతగా, దీనిని ఇక్కడ (తమ హృదయానికేసి చూపిస్తూ) అనుభూతి చెందలేకపోతున్నాం? ఇది ఎంతో వాస్తవమైనది. ఇదీ కళ! ఇదీ సౌందర్యం! ఇదీ రసానుభూతి!



మైకలాంజిలో రూపొందించిన కళాకృతుల కంటే, ప్రతి ఒక్కరూ మైకలాంజిలో లాగా తమ స్వంత కళను (జీవితాన్ని) అనుభూతి చెందడానికి ప్రయత్నించడాన్ని నేను ఎక్కువగా ఇష్టపడతాను (గురువుగారు నవ్వుతూ). ఆయన (మైకలాంజిలో) తన కళను ఎంతగా అనుభూతి చెంది వుంటాడో ఒక్కసారి ఆలోచించి చూడండి! అలాగే మీరూ మీ సృజనలను అనుభూతి చెందండి. ఇక్కడ ఎంతో కళ వుంది – ఎంత అందం – ఎన్ని మనస్సులు – నేనిలా చెబుతున్నపుడు, ప్రతి మనస్సు వివిధ రకాలుగా ఆలోచిస్తుంది. ఒకరికి అర్థమవుతుంది. ఒకరికి "ఏమిటిది"? అని ఓ సందేహం, ఒకరికి ప్రశ్నించాలంటే భయం, మరొకరు నిద్రమత్తుగా... దీనిలోని సౌందర్యాన్ని చూడండి.

**భక్తుడు :** బాబా మాకు జీవితంలో ప్రతిదీ ఇస్తున్నారు. ఇలా ఇస్తున్నప్పటికీ నేను కొన్నిసార్లు "ఇవన్నీ ఏమిటి? నేను ఇక్కడ ఉండకూడదు, నేను దూరంగా వెళ్లిపోవాలి, ఈ సాంసారిక విషయాలన్నింటి నుండి తప్పుకొని గురువుగారి దగ్గర ఉండిపోవాలి" అనుకుంటూ బాబా ఇచ్చిన వాటన్నింటి నుండి దూరంగా వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఇది నిజమైన భావనో లేక నేను చదివిన విషయాల ప్రోగు చేసుకున్న భావాల వలన కలిగిందో నాకు తెలియదు. లేకపోతే, ఇది జీవితంలో నాకు ఉన్నవాటిలోని సౌందర్యాన్ని చూడకుండా ఉండేటటువంటి ఒకరకమైన వ్యతిరేక భావమేమో?

**గురువుగారు :** అది ఏదైనా సరే, వేదాలంతటి గంభీరమైనదయినా కావచ్చు – అది గనుక ఒకవేళ మిమ్మల్ని నిస్తేజంగా, శుష్కంగా, రసానుభూతి లేకుండా చేస్తుంటే – దానిని వదిలిపెట్టేయండి, దాని మీద నుండి దృష్టి మరల్చండి! అలాగని అదేదో చెడ్డదని కాదు, కానీ అది మీలో ఆ అందం యొక్క ఎఱుకను కోల్పోయేలా చేస్తుంటే దానివల్ల ఎటువంటి ఉపయోగం లేదు.

సమస్త శాస్త్రాలు ప్రేమకు వ్యక్తీకరణలే – దానిని చూడటానికి ప్రయత్నించండి. వేదాలు, మంత్రాలు ఏమిటి? అవన్నీ ఋషులు, తత్త్వదర్శనులు తమ పారవశ్య బ్రహ్మానుభూతిలో వారు చేసిన ఉద్ఘోషలు, వారు పలికిన పలుకులు. (ఆ అనుభూతిలో) వారు నర్తించారు, కీర్తించారు. అవే మంత్రాలయ్యాయి.



కాబట్టి యదార్థంగా చూస్తే, అవన్నీ ఏమిటి? అవి వారి తన్మయత్వానికి, పారవశ్యమైన ప్రేమకు, పరబ్రహ్మస్వరూపం పట్ల వారి ప్రేమకు – ఆ అనుభూతికి – దానిని మీరు ఏ పేరుతోనైనా పిలవండి – అన్ని శాస్త్రాలూ దానికి వ్యక్తీకరణలే.

మీరు వాటిని అలా చూస్తే వాటిల్లోని సౌందర్యాన్ని చూడగలుగుతారు. అలా కాకుండా కేవలం శాస్త్రాలను ప్రావీణ్యం కోసం అధ్యయనం చేస్తే మనం వాటిని రసహీనం చేస్తాం, ఇంకా మన అంతరంగాన్ని అర్థరహితంగా, ఉదాసీనంగా, అందాన్ని, ప్రేమను, పారవశ్యాన్ని, కళాత్మకతను అభినందించడానికి, ఆస్వాదించడానికి పనికిరాకుండా తయారుచేస్తాం. అది విజ్ఞాన శాస్త్రం కాదు – నేను దానిని ఓ కళగా చూస్తాను. మహాత్ములు, ఋషులు వీరందరూ కళాభిజ్ఞులు. చివరికి భగవంతుణ్ణి కూడా ఓ కళాకారునిగా – "కవిహి"గా పేర్కొన్నారు. కాబట్టి ప్రతిదీ ఓ కళారూపమే. ఏదైతే హృదయాన్ని కదిలిస్తుందో అదే నిజమైన కళ!

**గురువుగారు :** దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి! ఇక్కడ ఇలా శిరిడీలో ఉండే సందర్భంగాని, లేక మరెక్కడున్నాసరే – మీకు ఎంత మంచి అవకాశం లభ్యమయిందో తెలుసుకోవడానికి ప్రయత్నించండి. చాలావరకు మీ చింతలు, కష్టాలు మీరు సృష్టించుకున్నవే. వాటికి అసలు అర్థమంటూ ఏమీ లేదు!

జీవితం చిన్నది. మీరు ఇక్కడ ఎందుకున్నారు అన్నదానికి ఎంత మాత్రమూ సంబంధం లేని విషయాలతో దానిని (జీవితాన్ని) వృథా చేసుకోవద్దు. మీ లక్ష్యాన్ని గుర్తుపెట్టుకోండి. అప్పుడు మీ జీవితమనే పుస్తకం మనస్సును రంజింపచేసే మంచి నవలలా కనిపిస్తుంది. లేకపోతే అది పాఠ్య పుస్తకంలా వుంటుంది. దానిని పాఠ్యపుస్తకంలాగా చదవకండి – అలా పాఠ్యపుస్తకమయితే అప్పుడు దానిలోని ప్రతి పదము, ఆ పదానికి అర్థం తెలుసుకోవాలి. దానిని వివరించాలి, మళ్లీ తిరిగి ఒప్పచెప్పాలి, అలా చేయకపోతే మనం ఫెయిల్ అవుతాము (తప్పుతాము) కాబట్టి అక్కడ తప్పక చేయాలనే భావం వుంటుంది. కానీ అదే నవలనుకోండి, దానిని ఎలా చదువుతాం? మనం ప్రతిదీ గుర్తుపెట్టుకుంటాం, దానిని ఆస్వాదిస్తాం, మనం దానిని ఇంకా గొప్పగా తిరిగి చెప్పగలం. ఈ జీవితం ఒక నవలవంటిది, ఓ అందమైన నవల! దీనిని ఎవరు వ్రాశారు? బాబా వ్రాశారు. మన జీవితానికి రచయిత ఆయన. దానిని చదవడానికి, ఆస్వాదించడానికి ప్రయత్నించండి – దానిని పాఠ్యపుస్తకం చెయ్యకండి.

**గురువుగారు :** మీరు ఏదో ఒక విషయంలో తాదాత్మ్యం చెంది, మిమ్మల్ని మీరు మర్చిపోయినపుడు – అక్కడ మీరు పొందే అనుభూతే రసానుభవం. సంస్కృతంలో దానిని రసానుభూతి అంటారు. ఉదాహరణకు మీరు ఒక సినిమా లేదా ఒక నాటకాన్ని చూస్తున్నపుడుగాని లేదా మంచి ఆసక్తికరమైన పుస్తకాన్ని చదువుతున్నపుడు కానీ, ఏం జరుగుతుందంటే మీరు అందులోని పాత్రలతో తాదాత్మ్యం చెందుతారు. ఆ

పాత్రలతో కలిసి నవ్వుతారు, ఏడుస్తారు. మీరు ఫలానా అన్న విషయం మీరు మర్చిపోతారు. అలా అనుభవాన్ని పొందడం రసానుభూతి.



నేను తరచుగా విషాదభరితమైన సినిమాను దీనికి ఉదాహరణగా చెప్తుంటాను. రక్తసంబంధం అనే తెలుగు సినిమాను తీసుకుందాం – అది ఒక అందమైన విషాదగాథ. నాకు తెలిసినంతవరకు మామూలు మనిషన్నవారెవ్వరూ, చివరికి బండరాయిలాంటి మనస్సున్న వారైనా లేక అసలు భావోద్వేగాలే లేని విరాగులైనా సరే – ఆ సినిమాను చూసి ఏడవకుండా బయటకురారు. ఆ సినిమాను చూడటానికి వెళ్లి అక్కడ వెక్కి వెక్కి ఏడుస్తుంటారు. ఇంకా వాళ్లే బయటకు వచ్చి "ఆ సినిమాను చూడటానికి మళ్లీ వెళ్లాలి" అని చెబుతుంటారు. (నవ్వులు) ఆ సినిమాను రెండువందలసార్లు చూసిన ఒక వ్యక్తి నాకు తెలుసు. ఊరకనే అలా ఏడవటానికే అక్కడకు వెళ్లేది (నవ్వులు) అది ఏమిటి? ఏడవటమన్నది అప్రియమైన అనుభవం. మరి ఆయన దానిని ఎందుకు కావాలనుకుంటున్నాడు? కారణమేమిటంటే అక్కడ ఆయన ఏడుస్తున్నప్పటికి ఆ రసానుభూతిని పొందుతున్నాడు. ఆ అనుభూతి ఆయనకు అంత గొప్ప ఆనందాన్నిస్తుంది. అదే అందులోని అద్భుతం (మిస్టరీ). ఎవరైనా ఏడవాలని ఎందుకనుకుంటారు? షేక్స్‌పియర్ వ్రాసిన హాస్యరచనలకన్నా విషాదాంత రచనలు ఎందుకంత ఎక్కువ ప్రాచుర్యం పొందాయి? ఎవరైనా షేక్స్‌పియర్ వ్రాసిన గొప్ప రచన గురించి చెప్పాలనుకుంటే విషాదాంత రచనలనే ఎందుకు ప్రస్తావిస్తారు? విషాదాంతాలే ఎందుకని? ఇతరులు బాధపడుతుంటే మనం సంతోషపడే మనుషులలోని క్రూరమైన స్వభావమా అది? కాదు. దానికి కారణం మనలోని క్రూర స్వభావం కాదు, అది ఒక రసానుభూతి కావడమే దానికి కారణం. ఎందుకంటే ఆ సినిమాను ఎవరైతే చూస్తున్నారో అతనూ ఏడుస్తున్నాడు – ఇతరులు బాధపడుతుంటే క్రూరుడనేవాడు ఏడవడు. అదే అందులోని తేడా!

**భక్తుడు :** నాకు ఏదైనా ఒక అందమైన అనుభూతి కలిగినపుడు, నేను దానిని అందరితో పంచుకోవాలనుకుంటాను. దాని గురించి ఎవరికైనా చెప్పాలి, దాని గురించి మాట్లాడాలి అని అనిపిస్తుంది. కానీ, నాకు సరైన పదాలు దొరకకపోవడం వల్ల దానిని పంచుకునేందుకు నాకక్కడ ఏ మార్గమూ కనిపించడం లేదు.

**గురువుగారు :** కేవలం ప్రయత్నించడం మాత్రమే మీరు చేయవలసింది. అవును, మనం ప్రయత్నించాలి. ఆ ప్రేమను, రసానుభూతిని పొందినటువంటివారు – వారు కూడా అలానే ఎంతగానో ప్రయత్నించారు. ఈ వేదశాస్త్రాలన్నీ కూడా ఆ ప్రయత్నమే. వారి అనుభవాన్ని వారు వర్ణించడానికి ప్రయత్నించారు. కానీ వారికది సాధ్యపడలేదు. నేను దానిని వర్ణించలేను అని చెప్పారు, కానీ ప్రారంభంలోనే ఆ మాట చెప్పలేదు. ఆ అనుభవం వర్ణింపశక్యం కాదని వారికి తెలుసు. అయినప్పటికి వారు దానిని వ్యక్తం చేయడానికి



ప్రయత్నించారు. ఎవరైనా కవిత్వం వ్రాసారంటే దానర్థం అసలైన ఆ కవితాత్మకమైన ఆ అనుభూతిని వారు నిజంగా వర్ణింపగలిగారనిగాని, ఆ అనుభవాన్ని నిజంగా పంచుకోగలిగారని కాదు – కానీ వాళ్లు ప్రయత్నించారు. హృదయపూర్వకమైన ఆ ప్రయత్న ఫలితమే కవిత్వం.

హిమాలయాలను చూస్తూ "అద్భుతం. ఎంత మనోహరంగా వున్నాయి? నేను వివరించలేను" అంటూ, ఇలా ప్రారంభంలోనే చేతులెత్తేసేవాడు కవి కాలేడు. దానిని వర్ణించడానికి ప్రయత్నించేవాడే కవి. "నిజంగా చెప్పాలంటే నేను దానిని వివరించలేను, కానీ నేను ప్రయత్నిస్తాను" అంటూ అతను తన కలాన్ని అందుకుంటాడు. అప్పుడతను ఒక వర్డ్స్‌వర్త్ – ఒక ఆంగ్ల కవిగా మారతాడు. ఆయన పదాలు ఎప్పుడూ విలువైనవిగా వుంటాయి. అందుకనే ఆయన వర్డ్స్ – వర్త్ (నవ్వులు). ఆ పదాల వెనుక గల ఆ ఆర్తి, ఆ స్ఫూర్తి, ఆ మథనం, ఇవి వుంటే చాలు. ఈ పరితాపమంతా పసిపాప ఏడవడంలాంటిది. ఆ ఏడుపుకు కారణం – అది చీమల్లాంటివి ఏవైనా కుట్టడం వల్లనా, పాలకోసమా, నిద్రలేకపోవడమా, బాగా ఉక్కగా వుండటమా – పశ్చిమదేశాలలో అయితే బాగా చల్లగా వుండటమా – ఇలా అది ఏదైనా సరే అదేమిటో తల్లికి తెలుసు. పసిపాప ఊరకనే అలా ఏడవాలని ఏడుస్తున్నా తల్లికి తెలుస్తుంది. దానర్థం ఏమిటి? అక్కడ పదాలేమన్నా వున్నాయా? "క్యార్...క్యార్.." (గురువుగారు పసిపాప ఏడుపును అభినయిస్తూ) అని వివిధ రకాల పద్ధతులలో, రాగాలలో సాగే ఏడుపుల వెనుక గల కారణం తల్లికి తెలుసు. "ఆ క్యార్ మనడం దానికోసం, ఈ క్యార్ మనడం దీనికోసం (నవ్వులు). నిజానికి, మొత్తం కవిత్వమంతా ఇటువంటి క్యార్..లే. దాని వెనుక గల ఆర్తిని తల్లి అర్థం చేసుకుంటుంది.

**భక్తుడు :** మనం ఎంపిక చేసుకునేదంటూ ఏమీ వుండదు అనే అవగాహన కలగడానికి మనం గట్టిగా ప్రయత్నించాల్సిన అవసరముంది అని చెప్పడం సరైందేనా? అది పరస్పరం విరుద్ధంగా వున్నట్లు కనిపిస్తుంది.

**గురువుగారు :** నిజానికి ఆ పరస్పర వైరుధ్యాన్ని నువ్వు అనుభవించగలిగితే అది మంచిదే. అవును, అది పరస్పరం విరుద్ధమే. అందులో చాలా అందం వుంది. అందులో అందం లేదా? అందుకనే కవిత్వంలోని అందమైన అంశాలలో అదీ (పరస్పర వైరుధ్యం) ఒకటి. జీవితమనేది ఓ పుస్తకం. ఓ అందమైన కవిత. జీవితం యొక్క సౌందర్య రసానుభూతిని అనుభూతం చేసుకోవడానికి ప్రయత్నించండి. మనం దానిని అలా చూసినపుడు జీవితమంతా అందమైన కవిత్వమవుతుంది. అవును! అది పరస్పరం విరుద్ధంగానే వుంటుంది. అంతమాత్రాన అందులో వాస్తవం లేదని కాదు. అది వాస్తవమే. అది మీకు అంతటా కనిపిస్తుంది. ఉదాహరణకు అరుణచల – అది పరస్పర విరుద్ధమే. అరుణ అంటే గతిశీలము, అచల అంటే స్థిరంగా వుండేది. స్థిరంగా ఉంటూనే గతిశీలం కావడమేమిటి? అది పరస్పర విరుద్ధం. కాబట్టి ఆ పరస్పర వైరుద్యాన్ని అనుభూతి చెందండి, ఆస్వాదించండి. దానిని ప్రతిఘటించవద్దు. అది మీకు ఎన్నో అందమైన



అనుభూతులను ఇస్తుంది. ఎన్నో అందమైన అనుభవాలను ఇస్తుంది. మీ జీవితాన్నంతా ఓ అందమైన కవితలాగా ఆస్వాదించండి. రమణమహర్షి ఎవరూ అడగకుండానే తమంతట తాముగా రచించిన "అరుణాచలపదికాన్ని" చదవండి. సాధారణంగా ఆయన ఎవరైనా అడిగితేనో లేదా ప్రశ్నించినపుడో మాత్రమే వ్రాసేవారు. కానీ ఒక్క "అరుణాచలపదికం" మాత్రం ఆయనకు వ్రాయాలనిపించి వ్రాశారు. నాకు అదే ఆయన నిజమైన కవిత – అదే ఆయన హృదయం అనిపిస్తుంది. అందులో ఎన్ని పరస్పర వైరుధ్యాలు కనిపిస్తాయో చూడండి – ఆయన దానిని ఆస్వాదించారు.

మనం ఓ మహోన్నత పర్వతాన్ని చూసినపుడు ఎలా వుంటుందో అది అలా వుంటుంది. పర్వతం మహోన్నతమైనదే, కానీ మీ సంగతేంటి? మనం చాలా చిన్నవాళ్లం. కానీ అలా చిన్నగా వుండటం దుఃఖదాయకమైన విషయమా? దానికి సిగ్గుపడాలా? కాదు, అక్కడ మనం దానిని ఆనందిస్తాం! మనల్ని మనం మరచిపోయి అక్కడున్న మహోన్నతత్వాన్ని అనుభూతి చెందుతాం. మనం సద్గురు సన్నిధిలో వున్నపుడు జరిగేది సరిగ్గా అదే – మనం అల్పులం అనే అనుభూతిని ఆనందించడం. అందుకే ఆయనను 'గురువు' అని పిలుస్తారు. 'గురు' అంటే పెద్దది అని. ఎంత పెద్ద అనంటే మనం చాలా అల్పం అనే భావన కలిగిస్తారు – అలా అని మనల్ని తక్కువ చేస్తారని కాదు. మనం దానిని ఆస్వాదిస్తాం. మళ్లీ అది పరస్పర విరుద్ధమే. ఆ ఆనందభావన, దాని రసానుభూతి, అదే మనకు మన సద్గురువుకు గల సంబంధం. ప్రతిచోటా సౌందర్యముంది, ప్రతిచోటా కవిత్వముంది!

## నీ లక్ష్యాన్ని నీవే తెలుసుకో - *మార్చి 2012*

**గురువుగారు :** మీకు ఏం కావాలో మొదట తెలుసుకోండి. అప్పుడు మన జీవితాన్నంతటినీ మలచుకోవడానికి అది ఒకే కేంద్ర బిందువుగా అవుతుంది. కాబట్టి ముందు మీకు ఏం కావాలో దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. "నేను దేని కోసం తపన పడుతున్నాను? అసలు నాకు నిజంగా కావాల్సిందంటూ ఏదైనా వుందా" అని ప్రశ్నించుకోండి. ఒకవేళ మీకిక ఏమీ అవసరం లేకపోతే, మీరు బాధపడుతూ నిస్పృహకు గురికావాల్సిన అవసరమేముంది? లేదా విచారిస్తూ, చింతిస్తూ దారి తప్పామనుకోవడం, సరైన దారిలో లేమనుకోవడం – ఇలాంటివన్నీ ఎందుకు? ఆ అవసరం లేదు. ఇటువంటివన్నీ వున్నాయనంటే మనకు కావాల్సినదేదో మనం పొందడం లేదని అర్థం. అలా అయినపుడు మనకు కావాల్సిన 'అది ఏంటి?' దానిని మన అన్వేషణకు మొదటి అడుగు కానివ్వండి.

**భక్తుడు :** ఏదైనా కోరిక నెరవేరినపుడు దాని వలన కలిగే ఆనందం తాత్కాలికంగానే వుంటుందనేది నా అనుభవం. కాబట్టి నా ప్రశ్న ఏమిటంటే, ఫలానా కోరిక తీరడం వలన శాశ్వతమైన ఆనందం కలుగుతుంది అనేటటువంటి కోరికంటూ ఏదైనా వుందా, లేదా అసలు కోరికలంటూ లేకపోతే తత్ఫలితంగా శాశ్వతమైన



ఆనందం కలుగుతుందా?

**గురువుగారు :** ఇక్కడ సమస్యల్లా మనకు కోరికలున్నాయి! మీకు ఎటువంటి కోరికలు లేకపోతే – అసలు సమస్యే లేదు! అప్పుడు మీకు ఇంకేమీ అవసరం లేదు. మీరు శాశ్వతమైన ఆనందంలో వుంటారు. మిమ్మల్ని శాశ్వతమైన ఆనందాన్ని పొందనీయకుండా అడ్డుకునేవి – కోరికలు (అనుకుందాం). మీరు ఇప్పుడు పొందేటటువంటి కాస్త ఆనందం మీ చేతిలో వున్న ఒక పక్షి లాంటిది; వేదాంత గ్రంథాలు పేర్కొనేటటువంటి ఆ శాశ్వతమైన ఆనందం పొదలో వున్న జంట పక్షుల వంటిది! "నేను చేతిలో వున్నటువంటి పక్షిని వదిలిపెట్టను, పొదలో వున్నవాటిని కూడా సాధిస్తాను"! అని అనుకోవడంలో తప్పేముంది? కనీసం నేను ఏదో తాత్కాలికమైన ఆనందాన్నైనా పొందుతున్నాను. కేవలం పొదలో వున్న ఆ రెండింటి కోసం మాత్రమే ఆలోచించేవాళ్లు, చేతిలో వున్న ఆనందాన్ని (పక్షిని) కోల్పోతున్నారు, వాళ్లకు కనీసం ఆ ఆనందం కూడా లేదు! ఖచ్చితంగా మనం వాళ్లకన్నా చాలా నయం. కనీసం, మనం ఈ క్షణంలో ఆనందంగా వున్నాం. అందువల్ల కేవలం గమ్యం మాత్రమే కాదు చేరే మార్గాన్ని కూడా ఆనందమయం కానివ్వండి! ఆనందాన్ని చేరుకునేందుకు దుఃఖమనేది మార్గమెందుకు కావాలి? మార్గం కూడా ఆనందమే కానివ్వండి! మనం సంతోషంగా, ఆనందంగా ఆ పారవశ్య అనుభూతిలో నర్తిస్తూ, ఇంకా ఇంకా మరింత ఆనందంవైపు సాగిపోతాం. ఆ తృప్తిలో, ఆ ఆనందంలో మనం పరిణతి చెందుతాం. తాత్కాలికమైన ఆనందం ఒకటి, రాబోయేటటువంటి శాశ్వతమైన ఆనందమనేది వేరొకటి – ఇలా రెండు విషయాలు లేకుండా ఈ తాత్కాలికమైన ఆనందాన్నే శాశ్వతమైన ఆనందంగా విస్తృతం/ప్రవర్ధమానం కానివ్వండి. అవి రెండూ వేరు వేరు కాదు. ఎలాగంటే, నీ చేతిలో వున్నా లేదా పొదలో వున్నా అవి పక్షులే కదా!

ఈ శాశ్వతానందం అనే భావన వినడానికి బాగానే ఉన్నట్లనిపించినా ఇందులో మరొక ప్రమాదం వుంది. అదేమిటంటే మనం కోరికలను లేకుండా చేసుకోవాలి. అది మనకు సాధ్యపడదు, మన యదార్థస్థితి అది కాదు; మనకు చాలా కోరికలున్నాయి. ఓ చిన్న ఆరోగ్యసమస్య సైతం శాశ్వతం అని పిలవబడేటటువంటి ఆ ఆనందం కోసం మనం చేసే ప్రయత్నానికి భంగం కలిగిస్తుంది. ఈ సమస్యే ఎప్పటికీ కొనసాగుతుంటుంది కానీ ఆ ఆనందం శాశ్వతంగా కొనసాగదు. ఇటువంటి చిన్న చిన్న సమస్యలు ఎదురవుతూ వుంటాయి. మనం మాత్రం కోరికలు మంచివి కాదు, మనకు కోరికలుండకూడదు అంటూ ఎప్పుడూ శాశ్వతానందం గురించి మాట్లాడుతుంటాం. కానీ ముందు, నా ఆరోగ్యం కుదుటపడాలి" ఇంకా, "నాకు ఆరోగ్యం కుదుటపడితేనే నేను దానికోసం ప్రయత్నం చేయగలను, కానీ నాకు ధ్యానానికి కూర్చోవడమంటే ఎంతో ఇష్టం, నేను కనీసం ధ్యానానికి కూడా కూర్చోలేకపోతున్నాను, నేను ధ్యానం చేసుకోవడం కోసం మరణించడానికైనా సిద్ధం!! కానీ భగవంతుడా, నేను ఈ మెడనొప్పితో చచ్చిపోతున్నాను, నాకు నడుంనొప్పిగా



వుంది, తలనొప్పిగా కూడా వుంది, కళ్లు కూడా బాధిస్తున్నాయి! ఇంకా నేను నిద్రలేకుండా వుండలేను, పదిగంటలకు పడుకోవాలి (వాస్తవస్థితి ఇలా వుంటే) మనమేమో 'శాశ్వతమైన ఆనందం' గురించి, దానిని 'పొందడం' గురించి, 'కోరికలను అణచివేయడం', 'అహాన్ని నాశనం చేయడం' (గురువుగారు నవ్వుతూ) ఇటువంటి గంభీరమైన / లోతైన విషయాల గురించి మాట్లాడుతూ వుంటాం. ఇవన్నీ డాంబికమైన మాటలు. అది నిజం కాదు, ఆచరణసాధ్యమూ కాదు.

దానికంటే మనం ఎక్కడున్నామో అక్కడి నుండి ప్రారంభిద్దాం. అది ఏదైనా కానివ్వండి, మనమేమిటి అనేటటువంటి ఆ వాస్తవికతలో అక్కడినుండి ఎదుగుదాం. అన్నింటికంటే ముందు, మన గురించి మనం స్పష్టంగా తెలుసుకోవడం; మనమేమిటి, మనం ఎక్కడున్నాం, మనకేం కావాలి, మన సమస్యలేంటి, మనకు ఆనందాన్ని కలిగించేది ఏమిటి, మనకు సరిగ్గా ఏం కావాలి అక్కడ నుండి ప్రారంభించండి! ఆ తరువాత మీరు పొందేది ఏదైనా – అది కనీసం ఒక్క శాతమైనా సరే అది వాస్తవం! అలా కాకపోతే మనకు నిజంగా అవసరం లేని దాని కోసం ప్రయత్నిస్తూ, మన జీవితమంతా పామును వదిలి పుట్టను కొట్టడంలాగా వుంటుంది.

మీరు ఇక్కడెందుకు కూర్చుని వున్నారు? ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు (అని అడిగితే) మీరు "నిర్వాణం పొందడానికి, ముక్తి పొందడానికి, ఆత్మసాక్షాత్కారం పొందడానికి, సటోరి – (అనగా జపనీస్ బుద్ధిజం పరిభాషలో ఆత్మసాక్షాత్కారం) పొందడానికి, దీన్ని పొందడానికి, దాన్ని పొందడానికి!" అని చెప్తారు. వినడానికి చాలా బాగుంది, కానీ మీకు ఇవన్నీ నిజంగా అవసరమా? ఊరకే అలా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, పరిశీలించుకోండి. అది అంత అత్యవసరమా? నిజానికి అంత అవసరం కాదు. చాలా మందికి జీవితంలో అన్నీ వుంటాయి. మంచి తిండి, మంచి భద్రత, మంచి బ్యాంక్ బ్యాలెన్స్, మంచి తల్లిదండ్రులు – ఇలా అన్నీవుంటాయి. ప్రాపంచికంగా వాళ్లకు ఏ కొరత కనిపించదు, అయినప్పటికి ఏదో లేదు అనేటటువంటి అనుభవం కలుగుతూ వుంటుంది. వాళ్లకు ఏదో కావాలి – వాళ్లు ఆనందంగా లేరు. వారిని "ఎందుకు మీరు సంతోషంగా లేరు? మిమ్మల్ని అసంతృప్తికి గురిచేసేది ఏమిటి?" అని మీరడిగితే వాళ్ల దగ్గర సరైన స్పష్టమైన సమాధానముండదు. "అలాంటిదేం లేదు, ఏదో.. తెలియని అసహనం, ఉన్నట్టుండి చెప్పలేని విచారం ఆవహిస్తుంది. జీవితంలో ఏదో కోల్పోతున్నామనే భావన కలుగుతోంది" అంటారు. ప్రతి ఒక్కరికి ఏదో కావాలనిపిస్తూ వుంటుంది, కానీ అదేంటో వారికి తెలియదు. మీరు 'ఏదో కొరతగా వుంది' అంటారు. మంచిది – అయితే ఆ కొరత ఏమిటి? అంటే అది మనకు తెలియదు.

కాబట్టి ఇది మీ అన్వేషణకు మొదటి అడుగు కావాలి. ఆ కొరత ఏమిటో దానికోసం, దానిని



తీర్చుకోవడం కోసం అన్వేషణ సాగాలి. మీరు పుస్తకాలు చదవడంతో, ఉపన్యాసాలు వినడంతో ప్రారంభిస్తారు. అప్పుడు ఎవరో, "మీకు కావాల్సింది, మీకు లేనిది – ముక్తి! మీలో ఉండేది? అహం! అందుకని అహాన్ని చంపుకుంటే మీరు ముక్తిని పొందుతారు!" అని చెప్తారు. దానికి మీరు "ఇంతేనా, ఇది చాలా సులభం" అనుకుంటారు. అంతే మనల్ని భ్రమింపచేసే ఆ మొత్తం ఘట్టం అక్కడ ప్రారంభమవుతుంది. మనల్ని మనం మోసం చేసుకుంటూ మనల్ని మనం స్వయంగా ఓ భ్రాంతికి గురి చేసుకుంటాం! "అవును ముక్తి మంచిది, మనకు ముక్తి కావాలి, మనకు సాక్షాత్కారం కావాలి" అని ఇలా ఆలోచించడం మొదలుపెడతాం. కాబట్టి ముక్తికి సంబంధించిన వాటన్నింటిని చదువుతాం, దాన్ని పొందడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాం. దానికోసం ప్రయత్నిస్తూ.. ప్రయత్నిస్తూ.. మనం ఎక్కడ బయలుదేరామో అది మరచిపోతాం.

మీరు దేనికోసం మొదాలుపెట్టారో దానిని వదిలిపెట్టవద్దు! ప్రతి ఒక్కరికీ ఒకే విధమైనటువంటి లేదా ఒకే రకమైనటువంటి కొరత వుండాల్సిన అవసరం లేదు! ముందు మనలో కొరత ఏమిటో దానిని తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. మీ అన్వేషణను మీ వ్యక్తిగతం కానివ్వండి. మీ మార్గం మీదే కానివ్వండి. మీ లక్ష్యం మీదే కానివ్వండి. మీరు పొందేది ఏదైనా అది (కూడా) మీదే కానివ్వండి – మీ లక్ష్యం– మీరు దానిని ముక్తి అని పిలిచినా సరే, నిర్వాణం అని పిలిచినా సరే – పేరుతో ఏం ఇబ్బంది లేదు – అయినా పేరులో ఏముంది? కానీ ఆ నిర్వాణం మన నిర్వాణం కావాలి, మన వ్యక్తిగత నిర్వాణం కావాలి. అది బుద్ధుడి నిర్వాణమో, సాయిబాబా నిర్వాణమో లేక రమణమహర్షి నిర్వాణమో కాదు – మీ నిర్వాణం కావాలి! "ఆయన నిర్వాణం ఆయన పొందారు, మన నిర్వాణం మనం పొందాలి, ఆయన స్వంతమార్గాన్ని ఆయన అనుసరించారు. నా స్వంత మార్గాన్ని నేను అనుసరిస్తాను" – ఇలా అయినపుడే మీరు నిజంగా బుద్ధుణ్ణి అనుసరించినట్లవుతుంది. మీ మార్గాన్ని మీరే ఏర్పరచుకోండి' అని ఆయన (బుద్ధుడు) చెప్పారు కదా! లేకపోతే, మనం మాయలో పడిపోతాం. ఒక వ్యక్తిగతమైన సమస్యను మనం అస్పష్టమైన సిద్ధాంతాలతో పరిష్కరించాలని ప్రయత్నిస్తాం. మనకు వ్యక్తిగతమైన దానిని మరింతగా మరింతగా అస్పష్టంగా చేసుకుంటాం. అయితే అది సత్ఫలితాలనివ్వదు, ఆ అస్పష్ట సిద్ధాంతం ఓ మాయలాగా మారుతుంది. మనల్ని మనం భ్రాంతిలో ఉంచుకోవడం మొదలుపెడతాం, అది మనల్ని మన యదార్థ స్థితి నుండి దూరంగా తీసుకెళు తుంది. కొంతమంది అదుపుతప్పి, మతిస్థిమితం కోల్పోయి పిచ్చివాళ్లు కూడా కావచ్చు, వాళ్లు తమ వాస్తవ స్థితిని చూడలేరు.

అది అంతులేని భ్రమగా మారవచ్చు. కాబట్టి దానిని ఆపండి! ముందు మీ వాస్తవ స్థితిని తెలుసుకోండి. మీ వాస్తవ స్థితిని అంగీకరించండి, అది ఎంత గొప్ప సిద్ధాంతమైనా సరే, ఎవరు చెప్పినా సరే – మీ



అనుభవాన్ని తప్ప మరే ఇతరమైన దానిని అంగీకరించవద్దు. మీ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, అక్కడ నుండి మొదలుపెట్టండి! ముందు మీకున్న లోటు ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించండి. అది (ఆ కొరత) అస్పష్టంగా వుంటుంది కాబట్టి, అది తీరే పద్ధతి కూడా మొదట అస్పష్టంగానే వుంటుంది. అది (ఆ ఆనందం) ఫలానా సందర్భంలో కలుగుతుందని మీకు అనిపించవచ్చు. ఉదాహరణకు, "నేను బాబా రూపాన్ని చూసినపుడు, ఏదో జరుగుతుంది, అదేంటో నాకు తెలియదు! కానీ ఎందుకనో నాలో ప్రేమ కలుగుతుంది. నేను సంతోషంగా వుంటాను, ఎంతో భద్రతాభావాన్ని పొందుతాను, అంతేకాకుండా నాలోని 'కొరత' అప్పుడు అనుభవంలోనికి రాదు. బహుశా ఇదే నాకు సరిపోయే మార్గం కావచ్చు". (మనలో) ఇలాంటి భావనను కలిగించేది అక్కడ ఏదో వుంది. అప్పుడు మనం దాని మీద దృష్టి పెట్టి దానిని ఇంకా ఇంకా స్పష్టం చేసుకోవడానికి, ఇంకా ఇంకా నిర్ధిష్టం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. అలా అయితే, మంచిది! అలానే ముందుకెళ్లండి, లేదూ, కొంతమంది దానిని వేరే మార్గాలలో  పొందుతారు, అది ఏదైనా కానివ్వండి. ఎలా అయినా సరే, మీరు ఎక్కడున్నారో అక్కడి నుండి ప్రారంభించండి, మీ అనుభవం అనే వాస్తవికతలో నుండి మొదలుపెట్టి, అక్కడి నుండి "దానిని పొందడానికి" ప్రయత్నించండి. అప్పుడు మీరు పొందేది మీ యదార్ధమవుతుంది – మీ వాస్తవమవుతుంది.

**భక్తుడు :** గురువుగారూ, మీరు మాకు సరైన మార్గాన్ని చూపడానికి ప్రయత్నిస్తున్నారా?

**గురువుగారు :** నేను మీకు ఏ మార్గమూ సూచించడంలేదు. మీ మార్గం ఏమిటో, మీ లక్ష్యం ఏమిటో తెలుసుకుని, ఆ తర్వాత ఆ మార్గంలో వెళ్లమని కోరుతున్నాను. నేనేదీ నిర్ధేశించడం లేదు. ఎవ్వరూ వేరొకరి లక్ష్యాన్ని నిర్ధేశించకూడదు. ముఖ్యమైన విషయమేమిటంటే – అది మీ లక్ష్యం,మీ అవసరం! కాబట్టి నేను మీకు ఏ లక్ష్యాన్ని సూచించడం లేదు, నేను కేవలం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాను. నేను చెప్పాలని ప్రయత్నిస్తున్న ముఖ్యమైన విషయమిది; మీ లక్ష్యం ఏమిటి? ప్రతి ఒక్కరికి తమదైన లక్ష్యం వుంటుంది. అవి అందరికీ ఉమ్మడిగా వుండే లక్ష్యాలు కావు. మీ లక్ష్యంలాగే మీ మార్గం కూడా మీ వ్యక్తిగతమైనదై వుండాలి. మీకు మీ గమ్యం ఏమిటో తెలిస్తే దానిని చేరుకోవాలనే అవసరం మిమ్మల్ని – మీదైనటువంటి ఆ గమ్యానికి మీదైన మార్గాన్ని కనుగొనేలా చేస్తుంది అప్పుడు మీరు నడిచే దారి మీ స్వంతమైనదిగా అవుతుంది. మీరు ఇంకొకరి మార్గంలో నడవాల్సిన అవసరం లేదు. మీరు వేరొకరి గమ్యాన్ని చేరుకోవలసిన అవసరం లేదు. గమ్యం, మార్గం ప్రతిదీ మీదే కానివ్వండి,  అప్పుడు మీరు ఏం చేసినా అది మీ లక్ష్యానికి ముడిపడి వుంటుంది. అదే నేను చెప్పేది – అర్ధవంతంగా వుండటం. మీ మార్గం అంత అర్ధవంతమైనది కానివ్వండి!!!



# సమదృష్టిని కలిగి వుండు!

శత్రువుల యెడల మిత్రుల యెడల సమబుద్ధి వహించు! మానావమానముల యెడల కూడా అట్లే వర్తించు! శీతోష్ణములు, సుఖదుఃఖములు సహజమని గ్రహించు! సమబుద్ధితో ప్రవర్తించు! దేనికీ అంటుకొనకు! అన్నింటినీ సమబుద్ధితో అనుకొనుటలో అందెవేసిన చేయిగా రూపొందు. సాధకుడు శత్రువును కూడా వినియోగించుకోవాలి! శత్రువు మనలోని లోపాలను ఎప్పటికప్పుడు పనిగట్టుకొని ఎంచి చూపుతూ వుంటాడు. ఇది నిజంగా మనకు సహకారమే కదా! మనలోని లోపాలనతడు చూపుతున్నాడు. వాటిని సరిచేసికొందాము. సాధనలో ముందుకు సాగుదాము. భగవంతుడే శత్రువు రూపంలో కూడా నిలబడి, ఇలా మనయోగసాధనకు కూడా సహకరిస్తున్నాడని మనం గ్రహించుకోవాలి.

అయితే కొందరు అకారణంగా మనమీద శత్రుత్వాన్ని పొందుతారు. దానికి కారణముండదు. ఏమిటిరా ఈ దారుణం అనిపిస్తుంది. మనలో ఏమీలేక పోయినా ఇలా అంటున్నారేమిటి? ఇలా కక్ష కడుతున్నారేమిటి అనిపిస్తుంది. అప్పుడు అది వారి స్వభావం, వారిలోని త్రిగుణదోషం వల్ల వారలా ప్రవర్తిస్తున్నారని మనం గ్రహించుకోవాలి. **త్రిగుణాల కలగలుపే కదా ప్రవర్తన.** ఆ గుణదోషం వలన అతడు మనని అలా చూస్తున్నాడు. రంగుటద్దాలలో నుండి చూచేవాడికి దృశ్యం ఎలా కనబడుతుందో ఇదీ అంతే! అయితే మనం అప్పుడేం చేయాలి? మనకేమీ ఇబ్బంది కలగనంతవరకు అతణ్ణి ఉపేక్షించాలి. అతడు మరీ ఇబ్బంది కలిగిస్తున్నాడనుకోండి. ధర్మం ప్రకారం అతని యెడల ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించాలి. అలా ప్రవర్తించేటప్పుడు మనలోని ధర్మం మేల్కొనాలి తప్ప, మనలోని రాగద్వేషాలు రాజుకోకూడదు. రాజుకుంటే మనమూ అతనిలాగే ప్రవర్తించినవాళ్లమవుతాం. ధర్మవశంలోంచి గుణవశంలోకి వెళ్లిపోతాం. అతడికి బుద్ధి చెప్పాలి అంటే అతణ్ణి మనం శత్రువుగా చూడనక్కరలేదు, వైద్యుడు రోగికి చికిత్స చేసినట్లు చేయాలి! అలాంటి స్థితిలో మనముండాలి! మన స్థితి నుండి మనం జారనక్కరలేదు, మెల్లగా అతడు మన స్థితికి చేరేట్లుగా చూడాలి!

ఆదిత్య హృదయంలో 'ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనం' అని వుంటుంది. తెలియనివారు అనుకుంటారు కదా. 'ఈ ఆదిత్య హృదయం చదివితే, ఇక మనకున్న సర్వశత్రువులు నశించిపోతారని' అలా అవతలివాడు కూడా చదివాడనుకోండి, మనను దృష్టిలో పెట్టుకొని, అప్పుడు మనమేమవుతాం? ఆలోచించండి ఇక్కడ, ఇలా అనడంలోని అర్థమేమిటి? మనం ఒకర్ని శత్రువు అంటున్నాం. బాగానే వుంది. అతను మన దృష్టిలో శత్రువుకాని, మరొకడికతడు తండ్రి, ఇంకొకడికి బిడ్డ. ఇంకొకరికి ప్రాణ స్నేహితుడు. ఆ ప్రక్కవాడికి ఆత్మబంధువు. కాని మనకతడు శత్రువు. నిజానికి శత్రువులు అని వేరే వున్నారా? లేదు. మన మనస్సు కొందరిని శత్రుభావంతో చూస్తోంది. ఆదిత్యహృదయం చదివినపుడు అలా చూడటమన్నది ఇక కరిగిపోతుంది. ఎవరూ శత్రువులుగా కనబడరు. ధర్మాధర్మాలను బట్టి నిర్ణయాలు జరుగుతాయి. అదుపు చేయవలసిన వారిని అదుపుచేస్తాం. అక్కున చేర్చుకోవలసిన వారిని అక్కున

చేర్చుకుంటాం. ఇదంతా ధర్మదృష్టితోనే జరుగుతుంది. దీనికి శత్రుదృష్టి అలవడటం ఎందుకు? మనస్సు చెదరడం ఎందుకు? కథ అడ్డం తిరగడం ఎందుకు? ఇవేవీ అక్కరలేదు మనం సూటిగా సాగిపోవచ్చు. అయితే అకారణంగా అన్నవాళ్లు ఎందుకంటున్నారు? దీనికొక కారణముంది. మనలో రాగద్వేషాలు ఏ మాత్రం వున్నాయో, అవి ఏ విధంగా ప్రవర్తిస్తున్నాయో చూపుదామన్న దేవుని లీల ఇది. కనుక దీనిని అకారణమనగలమా? ఏదైనా సృష్టిలో అకారణంగా ఒకటి జరుగుతుందా? ప్రతిదాని వెనుక దేవుని లీల దాగి వుంటుంది. గమనిస్తున్న కొద్దీ అది గోచరిస్తుంది.

కనుక సకారణంగా శత్రుత్వాన్ని వహించినపుడు వారు మనలోని లోపాలను గమనిస్తున్నారు గనుక వాటిని గ్రహించుకుని, మనస్సును కాస్త నిగ్రహించుకుని, మనని మనం దిద్దుకోవాలి. వారు అకారణంగా శత్రుత్వం వహిస్తున్నపుడు మనలోని రాగద్వేషాలు ముందుకు దూకుతున్నాయా, మనలోని ధర్మస్థితి మేలుకుంటున్నదా అన్నది గమనించుకుంటూ సాధనను కొనసాగించాలి. కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే వుండాలి. సాధన జరుగుతూనేవుండాలి. కర్తవ్య నిర్వహణమే సాధనగా సాగాలి. శత్రువు మనలోని లోపాలను ఎంచినట్లుగా, మిత్రుడు మనలోని మంచిని ప్రోత్సహిస్తాడు. మనలోని సద్గుణాలను చూసి మురుస్తూ, వాటిని పెంపొందించడానికి దోహదం చేస్తాడు. కర్తవ్య నిర్వహణలో అక్కరకు వస్తాడు. అండదండలనందిస్తాడు. చేదోడు వాదోడు అవుతాడు. చేయి చేయి కలుపుతాడు. ఎప్పుడూ మన శ్రేయస్సును కాంక్షిస్తాడు. మన సామర్థ్యం, దక్షత, తెలివితేటలు మొదలయినవన్నీ పెరగడానికి ఎంతగానో దోహదం చేస్తాడు. ఆపద వస్తే ఆదుకుంటాడు. 'పద నేనున్నాను' అంటాడు. మనను గుండెల మీద చేయి వేసుకుని నిద్రపోయేలా చేస్తాడు. 'అతడు నాకున్నాడు, అతడు నా కుడిభుజం' అతడు నా ఊపిరి, అతడు నా ఆరవప్రాణం అనిపిస్తూ వుంటాడు. అలా కనిపిస్తూ వుంటాడు. ఇలా మన సుఖసంతోషాలకు మన శక్తి సామర్థ్యాల విస్తృతికి ఎన్నో విధాల తోడ్పడుతాడు. మిత్రుడుగా దైవం మన ఎదుగుదలకు దోహదం చేస్తున్నాడు. ఇది మనం గమనించాలి. మిత్రుడుగా వున్నది అతడే. శత్రువుగా వున్నదీ అతడే! మిత్రుడుగా అతడు వెన్ను తడుతున్నాడు. శత్రువుగా అతడు వేలెత్తి చూపించి, మనను సరిచేస్తున్నాడు. నిజం చెప్పండి ఇద్దరూ అవసరమే కదా! అందుకని భగవంతుడు ఇద్దరుగానూ మనతో వుంటున్నాడు. మిత్రులుగా చెట్టపట్టాలు కడుతున్నది అతడే! శత్రువుగా తిట్లు శాపనార్థాలతో కాలెత్తి వస్తున్నది అతడే! ఒకచోట చేయికలుపుతున్నాడు. ఒకచోట కాలెత్తుతున్నాడు. మనకోసం ఎన్ని అవతారాలెత్తుతున్నాడు చూశారా మరి. చూడండి లీల, చూడగలిగితే లీల, చేతకాకపోతే గోల! గోల అనే స్థితి నుండి లీల అనే స్థితికి మనం అవలీలగా చేరుకుందాం, సద్గురుని అభయంతో.

– పార్థసారథి ప్రవచనాలు


సాయి సమగ్రదర్శిని : www.saibaba.com

సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : gurukrupa@saimail.com

సాయితత్త్వామృతాన్ని ఆస్వాదించి, అనుభూతి ప్రధానంగా అందించిన
సుదర్శనుడు



సాయితత్త్వాన్ని అందరూ అనుభవించి, ఆనందించాలని
ఆశించే అమృత హృదయుడు - గురువు